నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, మంగళవారం 6 ఆగస్టు 2024 | YADADRI BHUVANAGIRI

9 వరకు నేతన్న బీమా పథకానికి దరఖాస్తులు

- జిల్లా చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కామిల్

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 5 : నేతన్న బీమా పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎండీ కామిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత కార్మికులు, మరమగ్గాల కార్మికులు, ఇతర అనుబంధ కార్మికులు ఈ నెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ పథకంలో నమోదైన కార్మికులు మరణిస్తే వారి కుటుంబానికి రూ.ఐదు లక్షల బీమా సహాయం అందుతుందని, 18 నుంచి 59 సంవత్సరాలలోపు చేనేత కార్మికులు, అనుబంధ కార్మికులు అర్హులని తెలిపారు. జౌళి శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

సీఎం బ్రేక్ ఫాస్ట్‌కు మంగళమే..?

- బడ్జెట్‌లో ప్రస్తావించలే.. ఒక్క పైసా కేటాయించలే..
- గతంలో ఉదయం వేళ విద్యార్థులకు అల్పాహారం
- విద్యార్థుల హాజరు శాతం, పోషకాహారం పెంపే లక్ష్యం
- ఈ విద్యాసంవత్సరం నుంచి అమలు చేయని వైనం
- విద్యార్థులకు మళ్లీ తప్పని ఖాళీ కడుపులు
- సొంతంగా వండి పెట్టిన నిర్వాహకుల బిల్లులు పెండింగ్

మరో కార్యక్రమానికి కాంగ్రెస్ సర్కారు పాతర..!

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పథకాలను కాంగ్రెస్ సర్కారు ఒక్కొక్కటిగా పాతరేస్తున్నది. ప్రజలకు ఉపయోగపడేవి.. సమర్థంగా అమలైన స్కీమ్‌లను అటకెక్కిస్తున్నది. ఇప్పటికే అనేక పథకాలను నిలిపేయగా.. తాజాగా మరో కార్యక్రమానికి మంగళం పాడే దిశగా అడుగులు వేస్తున్నది. విద్యార్థులకు ఉదయం అల్పాహారం కోసం తీసుకొచ్చిన సీఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని ఆపేసింది. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు ఊసేలేదు. దీంతో విద్యార్థులు మళ్లీ ఉదయం వేళ ఖాళీ కడుపులతో పాఠశాలలకు వస్తున్న పరిస్థితి దాపురించింది. అల్పాహార కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా పెండింగ్ లోనే మూలుగుతున్నాయి.

గత బీఆర్ఎస్ సర్కారు విద్యను బలోపేతం చేసింది. సర్కారు పాఠశాలల్లో విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించింది. టెక్స్ట్ బుక్స్, యూనిఫామ్, రాగి జావ, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనంలాంటి అనేక కార్యక్రమాలు అమలు చేసింది. అంతేకాకుండా గతేడాది అక్టోబర్‌లో విద్యార్థుల కోసం సీఎం అల్పాహారం పేరుతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సర్కారు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా అమలు చేసింది.

వలిగొండ మండల కేంద్రంలో సీఎం బ్రేక్ ఫాస్ట్ చేస్తున్న విద్యార్థినులు (ఫైల్)

ఒకటో తరగతి నుంచి పదో తరగతి స్టూడెంట్లకు అందించింది. ఈ కార్యక్రమంతో రెగ్యులర్‌గా విద్యార్థులు స్కూళ్లకు వచ్చేలా స్ఫూర్తి నింపింది. అదే విధంగా విద్యార్థుల్లో ఉన్న పోషకాహార లోప నివారణకు దోహదపడింది.

ఈ విద్యా సంవత్సరం నుంచి బంద్..

పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా తొలుత వలిగొండ మండల కేంద్రం, బొమ్మల రామారం మండలంలోని మర్యాల ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం బ్రేక్ ఫాస్ట్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత జిల్లాలోని మరో 30 పాఠశాలకు విస్తరించారు. అల్పాహారం కార్యక్రమాన్ని నిత్యం మొబైల్ యాప్, ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్ ద్వారా పర్యవేక్షించారు. గత విద్యాసంవత్సరం పూర్తయ్యే వరకు సక్రమంగా కార్యక్రమం అమలైంది. ఈ విద్యా సంవత్సరంలో జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఇప్పటికే స్కూళ్లు తెరుచుకుని నెలన్నర దాటింది. కానీ పాఠశాలల్లో మాత్రం విద్యార్థులకు ఉదయం వేళల్లో అల్పాహారం కార్యక్రమం అమలు చేయడంలేదు. పాఠశాలల ప్రధానోపాధ్యాయుల మాత్రం తమకు ఆదేశాలు రాలేదని చెబుతున్నారు. మరోవైపు ఇప్పటికే సొంతంగా డబ్బులు ఖర్చు చేసిన కాంట్రాక్టర్లు, టీచర్లకు డబ్బులు చెల్లించడం లేదు. వీరంతా బిల్లుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

అమలు చేసిన రోజువారీ మెనూ ఇదీ..

సోమవారం : ఇడ్లీ సాంబార్ లేదా గోధుమ రవ్వ, చట్నీ
మంగళవారం : పూరి, ఆలు కుర్మ లేదా టమాటా బాత్ విత్ రవ్వ, చట్నీ
బుధవారం : ఉప్మా, సాంబార్ లేదా కిచిడీ, చట్నీ
గురువారం : మిల్లెట్ ఇడ్లీ, సాంబార్ లేదా పొంగల్, సాంబార్
శుక్రవారం : ఉగ్గాని లేదా పోహా లేదా మిల్లెట్ ఇడ్లీ, చట్నీ లేదా గోధుమ రవ్వ కిచిడీ, చట్నీ
శనివారం : పొంగల్ లేదా సాంబార్ లేదా వెజిటబుల్ పొలావ్ లేదా ఆలు కుర్మ

బడ్జెట్‌లో పైసా కేటాయించలే..

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. అందులో భాగంగా అన్ని పథకాలు, కార్యక్రమాలకు నిధులను కేటాయించింది. విద్యా శాఖకు సంబంధించిన పద్దుల్లో మాత్రం ఎక్కడా సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకానికి ఒక్క పైసా కేటాయించలేదు. బడ్జెట్ బుక్కుల్లో ఈ కార్యక్రమం గురించే ప్రస్తావించలేదు. దీంతో పథకం అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ పథకం మొత్తానికి బంద్ అయినట్లే అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు మాత్రం పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఖాళీ కడుపుతో చదువలేక పోతున్నాం

చాలా మంది విద్యార్థులు ఇంటి పరిస్థితుల రీత్యా ఉదయం పూట ఏం తినకుండా స్కూల్‌కు వస్తుండ్రు. ఈ మధ్య కొంత మంది విద్యార్థినులు ప్రేయర్ టైమ్ లో కిందపడి పోతుండ్రు. పోయిన సంవత్సరం పరీక్షల వరకు విద్యార్థులందరికీ ఉదయం పూట అల్పాహారాన్ని అందించారు. ఈ సంవత్సరం అల్పాహార పథకం లేదని బాధపడుతున్నాం. ఖాళీ కడుపుతో విద్యార్థులం చదువుల మీద శ్రద్ధ పెట్టలేక పోతున్నాం. విద్యార్థుల ఆరోగ్యాభివృద్ధికి ప్రభుత్వం ఇప్పటికైనా అల్పాహార పథకాన్ని ప్రారంభించాలి.

– రాపోలు ఇందుప్రియ, 10 వ తగరతి విద్యార్థిని, శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వలిగొండ

గంధమల్ల చెరువును పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

గంధమల్ల రిజర్వాయర్‌తో ఆలేరు సస్యశ్యామలం

- ప్రభుత్వ విప్ ఐలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

తుర్కపల్లి, ఆగస్టు 5 : గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణంతో ఆలేరు నియోజకవర్గం సస్యశ్యామలమవుతుందని, ఈ ప్రాంత ప్రజలకు సాగు నీటి కష్టాలు తొలుగుతాయని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండలంలోని మాదాపురం గ్రామంలో ఆయన సోమవారం స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం గంధమల్ల గ్రామంలోని గంధమల్ల చెరువును పరిశీలించారు. ఆ తర్వాత ఎంపీడీఓ కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. త్వరలోనే 1.04 టీఎంసీల సామర్థ్యంతో గంధమల్ల రిజర్వాయర్ పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం 240ఎకరాల భూమిని సేకరించిందని, రిజర్వాయర్ నిర్మాణానికి పోగా మిగిలిన స్థలాన్ని నిర్వాసిత రైతులకు భూమికి భూమి, పరిహారం అందించేందుకు కృషి చేస్తామని బీర్ల అయిలయ్య తెలిపారు. గంధమల్ల ప్రజల ఇండ్లకు నష్టం వాటిల్లకుండా రిజర్వాయర్ నిర్మాణం జరుగుతుందని చెప్పారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ రిజర్వాయర్ నిర్మాణంలో తక్కువ నష్టంతో ఎక్కువ మందికి లబ్ధి చేకూరాలన్నదే ప్రభుత్వం ధ్యేయమన్నారు. వారంరోజుల్లోగా ఇరిగేషన్‌శాఖ అధికారులు రిజర్వాయర్‌కు సంబంధించిన పూర్తి సమాచారం సేకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్షాలోమా, ఆర్డీఓ అమరేందర్, జడ్పీసీఈఓ శోభారాణి, ఇరిగేషన్ ఎస్సీ శ్రీనివాస్, ఈఈ రఘునాథ ప్రసాద్, డీఈ శైలేందర్, తాసీల్దార్ దేశియా, ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీబాయి, కాంగ్రెస్ మండల వర్కింగ్‌ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శంకర్‌నాయక్, కొమిరిశట్టి నర్సింహులు, రాజయ్య పాల్గొన్నారు.

స్వచ్ఛదనం..పచ్చదనం కార్యక్రమంలో భాగంగా భువనగిరిలోని 13వ వార్డులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే

పరిశుభ్రత.. పచ్చదనంతో ఆరోగ్యకర జీవనం

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి అర్బన్, ఆగస్టు 5 : పరిశుభ్రత.. పచ్చదనంతోనే ఆరోగ్యకర జీవనం ఉంటుందని, మొక్కలు పెంచడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛదనం..పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ శాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, కలెక్టర్ హనుమంతు కె.జెండగేతో కలిసి భువనగిరి పట్టణంలోని 13వ వార్డులో మొక్కలు నాటారు. అమృత్ 2.0 పథకం కింద రూ.21.80కోట్లతో చేపడుతున్న ఈఎల్ఎస్ఆర్ ట్యాంకుల నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం మాట్లాడుతూ పరిశుభ్రత, పచ్చదనంతో మన పరిసరాలు సుందరంగా అవుతాయన్నారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత నిర్మించడం ద్వారా గ్రౌండ్ వాటర్ లెవల్స్ పెరుగుతాయని తెలిపారు. జూలై 16 నుంచి భువనగిరి మున్సిపాలిటీలో 2 లక్షలు మొక్కలు నాటే లక్ష్యంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. భువనగిరి కోట రోప్ వే కోసం రూ.118 కోట్లు మంజూరయ్యాయని, ప్రస్తుతం రూ.68 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. భువనగిరిలో ముతిరెడ్డి గూడెం వెళ్లే దారిలో రూ.40 కోట్లతో స్టేడియం పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. కలెక్టర్ హనుమంతు కె.జెండగే మాట్లాడుతూ గ్రామాలు, మున్సిపాలిటీల్లో స్వచ్ఛదనం.. పచ్చదనంపై అవగాహన ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్టు 9 వరకు ప్రతి రోజూ ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 6న తాగునీటి సరఫరా, ఇంకుడు గుంతల నిర్మాణం, 7న మురికి కాల్వలు, నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రం చేయడం, గుంతలను పూడ్చడం, 8న సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన, వీధి కుక్కల దాడుల నివారణకు చర్యలు, 9న డ్రైడే సందర్భంగా ప్రభుత్వం సంస్థల్లో పరిశుభ్రం చేయడం వంటివి నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు జిల్లా కలెక్టర్ కె.గంగాధర్, ఆర్డీఓ అమరేందర్, మున్సిపల్ కమిషనర్ రామానుజులు రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎం.దశరథ, కౌన్సిలర్లు జనగాం కవితానర్సింహాచారి, అవంతిక క్రాంతి, జిల్లా అటవీ అధికారి పద్మజారాణి, జిల్లా వైద్యారోగ్య అధికారి మనోహర్, మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

50 పడకల ఆస్పత్రి ప్రారంభం

భువనగిరి ప్రభుత్వం ఏరియా దవాఖానలోని మొదటి అంతస్తులో 50 పడకల ఆస్పత్రిని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హన్మంతు కె.జెండగే సోమవారం ప్రారంభించారు. ప్రజా సౌకర్యం కోసం ప్రత్యేక పడకల ఆస్పత్రిని ప్రారంభించినట్లు వారు చెప్పారు. వారి వెంట జిల్లా అధికారులు, నాయకులు ఉన్నారు.

కాస్ట్లీ విస్కీలో చీప్ లిక్కర్!

- నల్లగొండలో నకిలీ మద్యం అమ్మకాలు
- విస్కీ బాటిల్‌లో 42శాతం ఆల్కహాల్‌కుగానూ 70శాతం గుర్తింపు
- ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో బయటపడ్డ అక్రమాలు
- జిల్లా కేంద్రంలో కనకదుర్గ, ప్రజా వైన్స్‌లపై కేసు నమోదు

నల్లగొండ, ఆగస్టు 5 : జిల్లా కేంద్రంలో నకిలీ మద్యం అమ్మకాలు బాహాటంగా జరుగుతున్నాయా ? కాస్ట్లీ విస్కీలో చీప్ లిక్కర్ కలిపి అమ్ముతున్నారా? అంటే నిజమే అనేది ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలో తేలిపోయింది. నల్లగొండ పట్టణంలోని రెండు వైన్స్ షాపుల్లో ఇటీవల రైడ్ చేసి తీసిన శాంపిల్స్‌లో నాణ్యత లేదని బయటపడింది. ఆల్కహాల్ శాతం 42 శాతానికి గానూ 70శాతం ఉన్నది. జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న కనకదుర్గ వైన్స్, ప్రజా వైన్స్‌లో ఈ కల్తీ మద్యం దందా నడుస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దాంతో ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి స్వాతి రెండు వైన్స్‌ల యాజమాన్యానికి నోటీసులు అందజేసి కేసు ఫైల్ చేశారు. వారికి చాలెంజ్ కింద నెల సమయం ఇచ్చిన తర్వాత చార్జిషీట్ వేస్తామని స్వాతి నమస్తే తెలంగాణకు తెలిపారు.

నల్లగొండ : హైదరాబాద్ రోడ్డులోని కనకదుర్గ వైన్స్‌లో జూలై 6న మద్యం శాంపిళ్లను సేకరిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి

ఎక్కువ ధర విస్కీలో చీప్ లిక్కర్ కలిపి..

జిల్లాలో విస్కీ రూ.560 నుంచి రూ.1,600 వందల వరకు అందుబాటులో ఉన్న బ్రాండ్లు వైన్స్‌ల్లో అమ్ముతున్నారు. చీప్ లిక్కర్ ఫుల్ బాటిల్ రూ.560 ఉండగా రాక్ ఫోర్డ్ విస్కీ ఫుల్ బాటిల్‌కు రూ.1600 వరకు ఉంటుంది. విస్కీల్లో అధిక ధర విస్కీ అయిన రాక్ ఫోర్డ్, బ్లెండర్స్ ప్రైడ్, సిగ్నేచర్ లాంటి మద్యం బాటిళ్లలో ఓసీ, ఐబీ లాంటి మద్యం కలిపి విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా వాటిల్లో 42 శాతం ఆల్కహాల్ శాతం ఉంటుంది. ఇటీవల ఫుడ్ సేఫ్టీ అదికారులు బ్లెండర్స్‌ప్రైడ్, ఐకాన్ అనే విస్కీ బాటిళ్లను శాంపిల్స్‌కు పంపగా వాటిల్లో ఆల్కహాల్ శాతం 70 ఉన్నట్లు గుర్తించారు. స్పెషల్ రైడ్‌లో భాగంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు రెండు వైన్ షాపుల్లో తనిఖీలు చేసి శాంపిల్స్ తీసుకెళ్లగా ఆ రెండింట్లోనూ కల్తీ మద్యం ఉన్నట్లు తేల్చారు. ఈ లెక్కన జిల్లా కేంద్రంతో పాటు పలుచోట్ల కల్తీ మద్యం జోరుగా విక్రయిస్తున్నట్లు స్పష్టమవుతున్నది.

వైన్స్ పర్మిట్ రూముల్లో ఇష్టారాజ్యంగా ఫుడ్

జిల్లాలో 174 వైన్స్ షాపులు ఉండగా వాటిల్లో యాజమాన్యాలు పర్మిట్ రూములకు అనుమతి తీసుకున్నప్పటికీ ఫుడ్ విక్రయించే నిర్వాహకులు మాత్రం అనుమతి తీసుకోకపోవటంతో సోమవారం ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి అందరికీ నోటీసులు జారీ చేశారు. ఆయా సిట్టింగ్ పర్మిట్ రూముల్లో ప్లేట్ పల్లీకి రూ.100, చికెన్‌కు రూ.150, తలకాయ, బోటి, మటన్‌కు రూ.200, చేపకు రూ.100 చొప్పున ఇష్టారాజ్యంగా ధరలు పెట్టి, మద్యం ప్రియులకు నాణ్యమైన ఆహారాన్ని ఇవ్వడం లేదని తెలుస్తున్నది. వైన్స్ సిట్టింగ్‌లలో ఫుడ్ లైసెన్స్ తీసుకోవాలని లేదంటే రూ.5లక్షల ఫైన్ విధిస్తామని ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి హెచ్చరించారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రైతు ప్రయోజనాల కోసం చెరువులు నింపాలి

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

నార్కట్‌పల్లి, ఆగస్టు 5 : కృష్ణా పరీవాహక ప్రాంతంలో అధికంగా వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టులన్నీ నిండి నీరు వృథాగా వెళ్తున్నందున జిల్లాలోని చెరువులన్నీ నింపాలని, రైతులకు ఇబ్బంది కలుగకుండా సాగు నీరు విడుదల చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రభుత్వాన్ని కోరారు. నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలోని తన నివాసంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో సరైన వర్షాలు లేక రైతులు నీటి ఎద్దడితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లాలో నాలుగు వేల చెరువులు ఉన్నాయని, నకిరేకల్ నియోజకవర్గంలో 350 చెరువులు ఉన్నాయని, ముందస్తుగా చెరువులకు మరమ్మతులు చేసి ప్రాజెక్టుల ద్వారా నీటిని నింపితే భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. బ్రాహ్మణ వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టును మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో అధిక నిధులు తీసుకొచ్చి ట్రయల్ రన్ సక్సెస్ చేశామని, ఆ తర్వాతే మండలంలోని అన్ని గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగాయన్నారు. తమ హయాంలో భూ సేకరణ ఎంతో జరిగిందని, కొద్దిపాటి భూ సేకరణ పూర్తి చేసి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి ప్రాజెక్టు పూర్తి చేయాలని కోరారు. అలాగే అయిటిపాముల ప్రాజెక్టును పూర్తి చేయాలన్నారు. ఈ రెండు ప్రాజెక్టులతోపాటు ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వ పనులు పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ఏడాదికి రెండు సార్లు పంటల పెట్టుబడికి రైతుబంధు ఇవ్వగా, కాంగ్రెస్ పాలనలో రైతుబంధు లేదని, రుణమాఫీ అంటూ ఆర్భాటానికే పరిమితమయ్యిందని ఎద్దేవా చేశారు. లక్ష రూపాయలు రుణం ఉన్న రైతుల్లో 30 శాతమే మాఫీ అయ్యిందని తెలిపారు. షరతులు లేకుండా రైతులందరికీ రుణ మాఫీ వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గలగలా కృష్ణమ్మ

- మొదట రెండు గేట్లు.. క్రమంగా 20 గేట్లు ఎత్తిన అధికారులు
- సాగర్ అందాలు చూసేందుకు పర్యాటకుల రాక

సాగర్ డ్యామ్ క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల

నందికొండ, ఆగస్టు 5 : తెలుగు రాష్ట్రాల వర ప్రదాయిని అయిన నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద పోటెత్తడంతో డ్యామ్ క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని స్పిల్‌వే మీదుగా దిగువన ఉన్న కృష్ణా డెల్టాకు సోమవారం విడుదల చేశారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్ నీటి మట్టం 590 (312 టీఎంసీలు) అడుగులకు గానూ 584 (296.55 టీఎంసీలు) అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 3,61,455 క్యూసెక్కుల నీరు వచ్చి సాగర్‌కు చేరుతుండడంతో కలెక్టర్ నారాయణ రెడ్డి, ఇరిగేషన్ ఇన్‌చార్జి సీఈ నాగేశ్వర్‌రావు, ఎన్నెస్పీ ఈఈ మల్లికార్జునరావుతో కలిసి నీటి విడుదలను ప్రారంభించారు. డ్యామ్‌పై పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చి కృష్ణమ్మకు చీరలతో వాయినం సమర్పించారు. ఉదయం 10.55 గంటలకు 13, 12వ క్రస్ట్ గేట్లను బటన్ నొక్కి నీటి విడుదలను ప్రారంభించారు. ఆ తర్వాత వరద ఉధృతిని తగ్గించడానికి గేట్లను ఎత్తుతూ క్రమంగా రాత్రి 10 గంటల వరకు 20 గేట్లు ఎత్తి 1,96,027 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. వరద ఆధారంగా క్రస్ట్ గేట్ల సంఖ్యను పెంచడం, తగ్గించడం జరుగుతుందని ఎన్నెస్పీ అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌కు 1,63, 220 క్యూసెక్కుల అవుట్ ఫ్లో, 3,23,331 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది.

రెండు పంటలకు నీరు అందిస్తాం : కలెక్టర్ నారాయణ రెడ్డి

నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ ద్వారా ఈ సంవత్సరం రెండు పంటలకు సాగు నీరు అందిస్తామని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఇప్పటికే ఎడమ కాల్వ ద్వారా తాగు, సాగు నీటికి నీటి విడుదల కొనసాగుతుందని, నదిలో పూర్తి స్థాయిలో నీటి సామర్థ్యం ఉన్నందున ఈ ఏడాది పంటలకు నీటి కొరత లేదని చెప్పారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతంలో రైతులు, జాలర్లు, పశువుల కాపర్లు నదీ సమీపంలోకి వెళ్లరాదని సూచించారు.

సోమవారం రాత్రి విద్యుత్ వెలుగుల్లో 16 క్రస్ట్ గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

సాగర్ డ్యామ్ ఎదుట సెల్ఫీ దిగుతున్న పర్యాటకులు

పర్యాలకుల సందడి

డ్యామ్ క్రస్ట్ గేట్లను ఎత్తడంతో కృష్ణమ్మ అందాలను వీక్షించడానికి పర్యాటకులు తరలివచ్చారు. క్రస్ట్ గేట్ల ద్వారా జాలువారుతున్న జలాలను వీక్షిస్తూ ఫొటోలు, సెల్ఫీలు దిగారు. డ్యామ్ పిల్లర్, ప్రధాన జల విద్యుత్ కేంద్రం, కొత్త బ్రిడ్జి, శివాలయం పుష్కర ఘాట్ సమీపంలో పర్యాటకులతో సందడి నెలకొన్నది. ఇక పోలీసు, రెవెన్యూ అధికారులు నాగార్జునసాగర్ డ్యామ్ పరిసరాలలో భద్రతను పర్యవేక్షిస్తున్నారు. కొత్త బ్రిడ్జి, పవర్ హౌస్ వచ్చే దారిలో బారికేడ్లు ఏర్పాట్లు చేశారు.

మాట్లాడుతున్న టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి

- టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

యాదగిరిగుట్ట, ఆగస్టు 5 : విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌తోపాటు మెరుగైన సేవలను అందించాలని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ, టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ ట్రస్ట్ భవనాన్ని సోమవారం వారు ప్రారంభించారు. అనంతరం రాష్ట్రం నలుమూలల నుంచి హాజరైన పవర్ డిప్లొమా ఇంజినీర్స్ సంఘం సభ్యులను ఉద్దేశించి వారు మాట్లాడారు. ప్రభుత్వం ఆశించిన విధంగా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ బీసీ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర సలహాదారులు గోవర్ధన్‌రెడ్డి, చలపతి రావు, మనోరంజన్‌రెడ్డి, తాజుద్దీన్ బాబా, నరేశ్‌కుమార్, పి. శ్రీనివాసులు, రాజు, స్థానిక సర్కిల్ సెక్రటరీ రాంరెడ్డి, అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

యాదాద్రి డీఆర్డీఓగా నాగిరెడ్డి

యాదాద్రి భువనగిరి, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ) : యాదాద్రి భువనగిరి జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారిగా నాగిరెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు డీఆర్డీఓగా ఉన్న కృష్ణన్ బదిలీపై హైదరాబాద్ వెళ్లారు. ఆయన్ను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో యాదాద్రి డీఆర్డీఓ ఉన్న నాగిరెడ్డి.. ఎన్నికల బదిలీల్లో భాగంగా నల్లగొండకు వెళ్లారు.